క్లుప్తంగా

ముగిసిన ఉత్సవాలు



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని గణేశ్‌నగర్‌లో షిర్డీ సాయిబాబా దేవాలయ వార్షికోత్సవాలు బుధవారం ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు ఉదయం సుప్రభాత సేవ, కాగడ హారతి, 21 కలశాలతో సాయిబాబాకు అభిషేకం నిర్వహించారు. ఆ తర్వాత దత్తాత్రేయ మహామంత్ర సాయి మూల అనుష్టాన హోమాలు, కుంభాభిషేకం, పూర్ణాహుతి పూజలు చేశారు. అనంతరం సాయిబాబాకు భక్తిశ్రద్ధలతో పల్లకీసేవ నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. వార్షికోత్సవ పూజల్లో ఆలయ ధర్మకర్త పద్మజా గోపాల్‌యాదవ్ పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలి

అడ్డాకుల: ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఫీల్డ్ అసిస్టెంట్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మూసాపేట తహసీల్దార్ రాజు, ఎంపీడీఓ అనురాధలకు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఫీల్డ్ అసిస్టెంట్లు మాట్లాడుతూ.. తమకు పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలను చెల్లించడంతో పాటు ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో చంద్రశేఖర్‌గౌడ్, యాదయ్య, రామకృష్ణ, శ్రీలత, కృష్ణయ్య, వెంకటేశ్వరమ్మ, కాశీం, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఫిల్టర్ ఇసుక సీజ్

దేవరకద్ర: మండలంలోని వెంకటాయపల్లి సమీపంలో నిల్వ చేసిన ఫిల్టర్ ఇసుకను బుధవారం రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. గతంలో కూడా ఇక్కడ ఫిల్టర్ ఇసుకను తయారు చేస్తుంటే ధ్వంసం చేసినట్లు తహసీల్దార్ కృష్ణయ్య తెలిపారు. మళ్లీ అక్కడే ఫిల్టర్ ఇసుక డంప్ చేసినట్లు అందిన సమాచారం మేరకు తనిఖీలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

పాఠశాల వివరాల నమోదు

దేవరకద్ర: మండలంలోని పెద్దరాజమూర్ ప్రాథమికోన్నత పాఠశాలకు సంబంధించిన వివరాలను యూడైస్‌లో నమోదు చేశారు. బుధవారం డైట్ కళాశాల విద్యార్థులు పాఠశాలను సందర్శించి మౌలిక వసతులు, మంచినీటి సౌకర్యం, మూత్రశాలల వివరాలు సేకరించారు. పాఠశాల గదులను పరిశీలించారు.

సద్వినియోగం చేసుకోవాలి

భూత్పూర్: బ్యాంకుల సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని రిసోర్స్ పర్సన్ శశికళ సూచించారు. బుధవారం మండలంలోని హస్నాపూర్‌లో సిర్డ్ స్వచ్ఛంద సంస్థ కొత్తకోట వారి ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత, బ్యాంకుల్లో వినియోగదారులకు అందిస్తున్న పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఖాతాదారులు పొదుపు పద్ధతులు పాటించడంతో పాటు ఇన్సూరెన్స్, పీఎం కిసాన్ తదితర పథకాలపై అవగాహన ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో సిర్డ్ సంస్థ కార్యదర్శి కుర్మయ్య, నారాయణ, అరుణ్ కుమార్, మహేశ్వరి, వెంకటేశ్, మాజీ సర్పంచ్ చంద్రకళ, ఐకేపీ సీసీ రాజన్న ఉన్నారు.

రజతోత్సవ సభ జయప్రదం చేయండి



దేవరకద్ర/భూత్పూర్/నవాబుపేట: వరంగల్‌లో ఈ నెల 27న నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని దేవరకద్ర, భూత్పూర్, నవాబుపేట మండలాల పార్టీ అధ్యక్షులు జెట్టి నర్సింహారెడ్డి, సత్తూర్ బస్వరాజ్‌గౌడ్, నర్సింహులు కోరారు. బుధవారం రజోత్సవ సభకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి గ్రామం నుంచి పార్టీ కార్యకర్తలు, నాయకులు సభకు తరలివచ్చి పార్టీ సత్తా చాటాలని కోరారు. కార్యక్రమాల్లో ఆయా మండలాల నాయకులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

మిడ్జిల్/భూత్పూర్: మండల కేంద్రంలో బుధవారం పశువులు, మేకలు, గొర్రెలకు గాలికుంటు నివారణ టీకాల పంపిణీ కార్యక్రమాన్ని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి ప్రారంభించారు. మండల పశువైద్యాధికారి శివకాంత్, సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు అల్వాల్‌రెడ్డి, గౌస్, మల్లికార్జున్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, సత్యం, భీమయ్య పాల్గొన్నారు.

■ పశువుల ఆరోగ్యంపై పెంపకందారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డా.శివానందస్వామి సూచించారు. భూత్పూర్ పశువైద్య కేంద్రంలో ఫుడ్ అండ్ మౌత్ డీసీజ్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. వెటర్నరీ డా.మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం

- ప్రతి గింజను మద్దతు ధరకు కొనుగోలు చేస్తాం
- దళారులను నమ్మి మోసపోవద్దు
- కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవంలో ప్రజాప్రతినిధులు

చిన్నచింతకుంట/కోయిల్‌కొండ/మిడ్జిల్/నవాబుపేట/మహమ్మదాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం చిన్నచింతకుంట, కురుమూర్తి, అల్లిపూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. యాసంగిలో పండించిన పంటను విక్రయించేందుకు రైతులు ఎలాంటి ఇబ్బందులు పడొద్దన్న ఉద్దేశంతో ప్రభుత్వం గ్రామాల్లోనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. రైతులు పండించిన ప్రతి గింజను మద్దతు ధరకు కొనుగోలు చేస్తామన్నారు. సన్నరకాలకు బోనస్ చెల్లించనున్నట్లు తెలిపారు. దళారులను నమ్మి పండించిన పంటను విక్రయించి మోసపోవద్దని రైతులకు సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్, మార్కెట్ కమిటీ చైర్మన్ కథలప్ప, తహసీల్దార్ ఎల్లయ్య, ఏఓ రాజేశ్ ఖన్నా, ఏపీఎం విష్ణుచారి, సీసీలు రాములు, కుర్మన్న తదితరులు పాల్గొన్నారు.

■ కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని నారాయణపేట ఎమ్మెల్యే డా. చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. కోయిల్‌కొండ మండలంలోని సూరారం, ఇబ్రహీంనగర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగులతో పాటు టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు.



చిన్నచింతకుంటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి



సూరారంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి



మిడ్జిల్ మండలం వాడ్యాల్‌లో..

కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వై.విద్యాసాగర్‌గౌడ్, జి.రవీందర్, ఎంపీడీఓ కాశప్ప, ఏఓ యామారెడ్డి, నాయకులు రవినాయక్, బండి యాదవ్ కుమార్, జగన్, శేఖర్, రామస్వామి, నాగరాజు, మనోజ్ పాల్గొన్నారు.

■ మిడ్జిల్ మండలంలోని వాడ్యాల్, వేముల, బోయిన్‌పల్లి, చిల్వేర్, కొత్తూర్, వెలుగొమ్ముల గ్రామాల్లో సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలను మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి ప్రారంభించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి బాల్‌రెడ్డి, నాయకులు అల్వాల్‌రెడ్డి, గౌస్, బంగారు, రాజారెడ్డి, వెంకటేశ్‌గౌడ్, విజయ్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

■ నవాబుపేట మండలం రుద్రారంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ లింగం, సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు, తహసీల్దార్ శ్రీనివాస్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జయరాంనాయక్, ఎంపీఓ భద్రునాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ శశిధర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కృష్ణగౌడ్, భూపాల్‌రెడ్డి, రవీందర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకటేశ్, వెంకటేశ్వర్‌రెడ్డి, తాహెర్, ప్రతాప్ పాల్గొన్నారు.

■ మహమ్మదాబాద్ మండలం నంచర్లలో సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కేఎం నారాయణ ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఓ నరేందర్, ఈసా, లక్ష్మీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

గొప్ప సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం



జడ్చర్ల టౌన్: నాటక, సాహితీ రంగాలతో పాటు సామాజిక ఉద్యమకారుడిగా కందుకూరి వీరేశలింగం అందించిన సేవలు చిరస్మరణీయమని సంస్కారభారతి సభ్యుడు గోనెల రాధాకృష్ణ అన్నారు. బుధవారం సంస్కారభారతి ఆధ్వర్యంలో స్థానిక సరస్వతి శిశుమందిరంలో కందుకూరి వీరేశలింగం జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వీరేశలింగం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీరేశలింగం గొప్ప సంఘ సంస్కర్త అని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు కళావతి, రజిత, సాయిప్రభ, విఘ్నేశ్వరి, ప్రియాంక, రాజశ్రీ ఉన్నారు.

సామాజిక మాధ్యమాలపై అప్రమత్తంగా ఉండాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: సామాజిక మాధ్యమాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు సూచించారు. ఈవ్ టీజింగ్, సోషల్ మీడియా వేదికగా బాలికలు, మహిళలపై వేధింపులకు పాల్పడిన వారికి బుధవారం మహిళా పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. మహిళల వేధింపులపై తీవ్రంగా స్పందిస్తున్నట్లు చెప్పారు. అమ్మాయిలు సామాజిక మాధ్యమాలపై అప్రమత్తంగా ఉండాలని.. ఏదైనా సమస్య వస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

ముగిసిన ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం

హన్వాడ: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్–4వ ఆధ్వర్యంలో మండలంలోని చిన్నదర్పల్లిలో ఏర్పాటుచేసిన వేసవి శిబిరం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు ఐదు రోజులపాటు గ్రామంలో పర్యటించి పలు అంశాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించినట్లు చెప్పారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఇమ్మాన్యుయేల్, మద్దిలేటి, కేశవర్ధన్, ప్రవీణ్, రవళి, విజయలక్ష్మి, మంజుల పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి



దేవరకద్ర: గర్భిణులు, బాలింతలు పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు సూచించారు. బుధవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన పోషక పక్షోత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆకుకూరలు, గుడ్లు, పాలు లాంటి పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం వల్ల తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వార అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి శరత్‌చంద్ర, కోఆర్డినేటర్ నరేందర్, సీహెచ్‌ఓ పరంకుశం, సూపర్‌వైజర్లు అరుణ, కమల, గీతకుమారి, వెంకటేశ్వరమ్మ, జ్యోతి, సుశీల పాల్గొన్నారు.

కావేరమ్మపేట బావిలో 30హెచ్‌పీ మోటారు ఏర్పాటు

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీలోని కావేరమ్మపేట మంచినీటి బావిలో బుధవారం 30 హెచ్‌పీ మోటారు బిగించారు. బావిలో ఉన్న మోటారు మరమ్మతుకు గురికావడంతో కొత్త మోటారును ఏర్పాటు చేయగా.. మున్సిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత ప్రారంభించారు. కొత్త మోటారు ఏర్పాటుతో 1, 2, 11 వార్డుల్లో తాగునీటి సమస్యలు తీరాయని చైర్‌పర్సన్ తెలిపారు.

■ మున్సిపల్ కార్యాలయ నూతన భవన నిర్మాణ పనులను చైర్‌పర్సన్ పుష్పలత, కమిషనర్ లక్ష్మారెడ్డి పరిశీలించారు. జూలై చివరి నాటికి పనులను పూర్తిచేయాలని వారు గుత్తేదారుకు సూచించారు. వారి వెంట మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పాలాది సారిక, ఏఈ గాయత్రి, మిషన్ భగీరథ ఏఈ వినోద్, కౌన్సిలర్లు బుక్క మహేశ్, సతీష్ తదితరులు ఉన్నారు.



కావేరమ్మపేట బావిలో ఏర్పాటుచేసిన మోటారును ప్రారంభించిన చైర్‌పర్సన్ పుష్పలత

బీజేపీ పాలనలో ప్రజా సమస్యలు పక్కదారి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రజల మధ్య చీలికలు తెచ్చి.. ప్రజా సమస్యలను పక్కదారి పట్టిస్తుందని సీపీఎం రాష్ట్ర నాయకుడు టి.సాగర్ ఆరోపించారు. జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన సీపీఎం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వంటగ్యాస్ ధరలను అమాంతం పెంచడం ప్రజలకు భారంగా మారిందన్నారు. బీజేపీ చెప్పిన మాటలకు, చేస్తున్న పనులకు పొంతన లేకుండా పోయిందన్నారు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో జాప్యం జరుగుతుందని తెలిపారు. స్థానిక సమస్యలపై సీపీఎం పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయి నుంచి పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా నాయకులు కిల్లెగోపాల్, ఎ.రాములు, కురుమూర్తి, పద్మ, మోహన్, లక్ష్మయ్య, జగన్, చంద్రకాంత్, రాజ్‌కుమార్, వేణుగోపాల్ ఉన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర నేత టి.సాగర్

ఉచిత ఆరోగ్య శిబిరం విజయవంతం



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: రెండో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక రాజేంద్రనగర్‌లోని డాక్టర్ జీవీకేఆర్ న్యూరో కేర్ ఆస్పత్రిలో ఈనెల 15, 16వ తేదీలలో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ రెండు రోజులూ ఇక్కడికి వచ్చిన రోగులకు న్యూరో, ఇన్‌ఫెర్టిలిటీ పరీక్షలతో పాటు అత్యవసరమైన ఆరోగ్య స్క్రీనింగ్ అందించినట్లు నిర్వాహకులు డాక్టర్ జి.వి.కె.ఆర్.గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరానికి విశేష స్పందన వచ్చిందన్నారు. ఈ సందర్భంగా ఉచితంగా బీపీ, బీఎంఐ, బయో ఎస్తెసియోమెట్రీ, ఎముకల ఘనత్వం వంటి పరీక్షలు చేశామన్నారు. తమ ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామన్నారు.

న్యాయం చేయాలని రైతుల ధర్నా

హన్వాడ: మండలంలోని అమ్మాపూర్ శివారులో 26 ఎకరాల భూమిని కొందరు జీపీఏ చేసి విక్రయించారని.. ఆ జీపీఏను రద్దుచేసి తమకు న్యాయం చేయాలంటూ హన్వాడ, కోయిల్‌కొండ మండలాల్లోని పలు గ్రామాల రైతులు బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. హైకోర్టు ఆదేశాల మేరకు ఆ భూములను తమ పేరిట రికార్డుల్లో నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కోర్టు ప్రతులతో పాటు వినతిపత్రాలను తహసీల్దార్ కిష్ట్యా నాయక్‌కు సమర్పించారు. అంతకుముందు వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నాగన్న, మట్టగళ్ల వెంకటయ్య, జంబులయ్య తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న రైతులు

పక్షులకు నీటితొట్ల ఏర్పాటు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ క్యాంపస్‌లో పక్షుల దాహార్తి తీర్చేందుకు బుధవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో నీటితొట్లు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా పీయూ రిజిస్ట్రార్ రమేశ్‌బాబు మాట్లాడుతూ.. పీయూ క్యాంపస్‌లో సుమారు వంద ఎకరాల్లో అడవి ఉండగా.. ఎన్నో రకాల పక్షులు ఉన్నాయన్నారు. వేసవిలో పక్షుల దాహార్తి తీర్చేందుకు నీటితొట్లు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పీయూ ఆడిట్ సెల్ డైరెక్టర్ చంద్రకిరణ్, ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్ కృష్ణయ్య, ఏబీవీపీ నాయకులు వేణుగోపాల్, సంగీత, సతీశ్, నందిని, రవికుమార్, కార్తిక్, కృష్ణ పాల్గొన్నారు.



నీటితొట్లు ఏర్పాటు చేస్తున్న పీయూ వీసీ

కూలీలకు కనీస కూలి ఇవ్వరా?

జడ్చర్ల టౌన్: ఉపాధి హామీ పథకంలో కూలీలకు కనీస కూలి రూ. 307 ఉండగా.. జడ్చర్ల మండలంలో మాత్రం రూ.109 నుంచి రూ.148 ఎలా ఇస్తారని డీఆర్డీఓ నర్సింహులు ప్రశ్నించారు. బుధవారం జడ్చర్ల మండల పరిషత్ కార్యాలయంలో ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్డీఓ మాట్లాడుతూ.. జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో కూలీలకు రూ.250 పైగా కూలి వస్తుంటే.. ఇక్కడ మాత్రం ఎందుకు ఇవ్వలేకపోతున్నారని నిలదీశారు. టీఏస్, టీఏలు ఏం చేస్తున్నారని.. ఫీల్డ్ విజిట్ చేయడం లేదా అంటూ మండిపడ్డారు. కూలీలకు తక్కువ కూలి ఇస్తే పనులకు ఎలా వస్తారని ప్రశ్నించారు. ఇకపై అలా జరగకూడదని అన్నారు. పనులు చేపట్టే ప్రదేశాల్లో కూలీలకు తప్పనిసరిగా తాగునీరు అందుబాటులో ఉంచాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనని అన్నారు. లేబర్ మొబలైజేషన్‌లో మండలం వెనకబడి ఉందని.. జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూమిలేని వ్యవసాయ కూలీలను తప్పనిసరిగా పనులకు వచ్చేలా చూడాలని.. వారికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద రూ.12వేలు లబ్ధి కలిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ విజయ్‌కుమార్, ఏపీఓ విజయభాస్కర్‌రెడ్డి ఉన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న డీఆర్డీఓ నర్సింహులు

త్రిసభ్య కమిటీ విచారణ

మండలంలోని పోలేపల్లి గామపంచాయతీలో జరిగిన అవకతవకలపై డీఆర్డీఓ నర్సింహులు నేతృత్వంలోని త్రిసభ్య కమిటీ విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. అయితే కార్యదర్శి సెలవులో ఉండటం, మాజీ సర్పంచ్ అందుబాటులో లేకపోవటంతో తిరిగి ఈ నెల 24న విచారణకు వస్తామని డీఆర్డీఓ తెలిపారు. త్రిసభ్య కమిటీలో పీఆర్ ఈఈ నరేందర్‌రెడ్డి, ఎంపీడీఓ విజయ్‌కుమార్ ఉన్నారు.

‘ముగ్గురు చనిపోయినా పరామర్శించే దిక్కు లేదు’

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): మహబూబ్‌నగర్ మండలంలోని దివిటిపల్లి క్వారీలో పడి ముగ్గురు యువకులు చనిపోతే.. వారి కుటుంబాలను కనీసం పరామర్శించే దిక్కు లేకుండా పోయిందని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం మృతుల కుటుంబాలను ఆయన పరామర్శించి ఓదార్చారు. అంతకుముందు జనరల్ ఆస్పత్రిలో మృతదేహాలను చూశారు. వెంటనే పోస్టుమార్టం చేసి కుటుంబ సభ్యులకు అప్పగించాలని వైద్యులకు సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అద్దె ఇంట్లో ఉంటున్న పేదలకు మూడేళ్ల క్రితం బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్‌బెడ్రూం ఇళ్లను నిర్మించి ఇచ్చిందన్నారు. అక్కడ నివాసం ఉండి చిన్నచిన్న పనులు చేసుకుని బతుకుతున్న కుటుంబాల్లో అనుకోని విషాదం చోటు చేసుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. వారిని కనీసం కలెక్టర్, ఎస్పీ పరామర్శించకపోవడం బాధాకరమన్నారు. అధికారులు ప్రమాద స్థలాన్ని పరిశీలించి.. మృతుల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మల్లు దేవేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు శివరాజు, రాఘవేందర్‌గౌడ్, అంబదాస్, శివ ఉన్నారు.



మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

రాజీవ్ యువవికాసానికి 3,723 దరఖాస్తులు

జడ్చర్ల టౌన్: రాజీవ్ యువవికాసం పథకానికి దరఖాస్తులు వెల్లువెత్తాయి. జడ్చర్ల మున్సిపాలిటీలో 1,202, మండలంలో 2,521 దరఖాస్తులతో కలిపి మొత్తం 3,723 దరఖాస్తులు అందాయి. మున్సిపాలిటీ పరిధిలో వచ్చిన దరఖాస్తుల్లో బీసీ 587, ఎస్సీ 190, ఎస్టీ 36, మైనార్టీ 340, ఈబీసీ 49 ఉన్నాయి. మండలంలో ఎస్సీ 538, ఎస్టీ 565, బీసి 1,253, ఈబీసి 5, మైనార్టీ 142, క్రిస్టియన్ మైనార్టీ 18 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు.

అయ్యప్ప సేవాసమితి అధ్యక్షుడిగా మశ్చందర్‌నాథ్

అడ్డాకుల: మూసాపేట అయ్యప్పగుట్టపై వెలసిన సంకల్పసిద్ధి హరిహర అయ్యప్ప క్షేత్రంలో బుధవారం అయ్యప్ప సేవాసమితి నూతన అధ్యక్షుడిగా నామాల మశ్చందర్‌నాథ్‌ను ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా గూపని కొండయ్య, కోశాధికారిగా మిడ్జిళ్ల విశ్వేశ్వర్, గౌరవాధ్యక్షులుగా తూము శ్రీకాంత్‌రెడ్డి, భాస్కర్ చందర్‌గౌడ్, శెట్టి చంద్రశేఖర్, అశోక్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా ముచ్చర్ల శ్రీనివాసులు, ప్రభాకర్, కొంగరి శ్రీనివాసులు, సరేందర్‌గౌడ్, గుబ్బ శ్రీహరి, కోట్ల రవి, కార్యనిర్వాహక కార్యదర్శిగా రాజుగౌడ్, సంయుక్త కార్యదర్శులుగా కాశీనాథ్, చెన్నారెడ్డి, నర్సింహారెడ్డి, సతీశ్, ఏర్వ తిరుపతయ్య, ప్రచార కార్యదర్శులుగా నరేశ్‌గౌడ్, అంజి, విజయ్ ఎన్నికయ్యారు.

నేడు ‘భూ భారతి’పై అవగాహన సదస్సు

జడ్చర్ల టౌన్: ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన భూ భారతి చట్టంపై గురువారం పట్టణంలోని చంద్రా గార్డెన్‌లో అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగిందని.. రైతులు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రంలో భూ సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ భారతి చట్టంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పిస్తామన్నారు. ధరణిలో లోపాలను అవకాశంగా తీసుకుని అక్రమార్కులు భూములను కబ్జా చేయటంతో పాటు వాస్తవంగా హక్కులు కలిగిన వారికి అన్యాయం చేసి రూ.లక్షల కోట్లు కొల్లగొట్టారని పేర్కొన్నారు. ధరణిపై అందరికీ అవగాహన లేకుండా రహస్యంగా చట్టాలు చేయడంతోనే ఇలా జరిగిందన్నారు. అందుకే తమ ప్రజాప్రభుత్వం తీసుకువస్తున్న భూ భారతి చట్టంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని నిర్ణయించిందన్నారు. జడ్చర్లలో నిర్వహించే సదస్సును రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు ఆలయ భూముల కౌలుకు వేలం

జడ్చర్ల టౌన్: గంగాపురం శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయానికి సంబంధించిన 112ఎకరాల భూమిని కౌలుకు ఇచ్చేందుకు గురువారం ఆలయ ప్రాంగణంలో వేలం నిర్వహించనున్నట్లు ఈఓ దీప్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల రైతులు తమ ఆధార్‌కార్డుతో హాజరు కావాలని సూచించారు.

రుద్రారంలో పోతరాజు విగ్రహ ప్రతిష్ఠాపన



నవాబుపేట: మండలంలోని రుద్రారంలో బుధవారం పోతరాజు విగ్రహం ప్రతిష్ఠించారు. గ్రామదేవతల వార్షిక పూజలను పురస్కరించుకొని గ్రామ పొలిమేరలో వేద మంత్రోచ్ఛారణల మధ్య పోతరాజు విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు మధుసూదన్‌రెడ్డి, కృష్ణగౌడ్, వెంకటేశ్వర్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, రాజు, వెంకట్‌రెడ్డి, యాదయ్య, రవీందర్, జైపాల్‌రెడ్డి, రవి, చిరంజీవి, వెంకట్రాములు, వెంకటయ్య పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

జడ్చర్ల టౌన్: జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం నివాస భవనాలు, అపార్ట్‌మెంట్లలో అగ్నిప్రమాదాల నివారణపై జడ్చర్ల ఫైర్‌స్టేషన్ సిబ్బంది అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని వెంకటేశ్వర కాలనీలో ఎల్‌పీజీ సిలిండర్ లీక్ అయినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అదే విధంగా వివిధ రకాల అగ్నిమాపక పరికరాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఫైర్‌స్టేషన్ ఆఫీసర్ రాజేందర్, ఎల్ఎఫ్‌జీ రాఘవేందర్, సురేశ్, నవీన్‌కుమార్, ప్రేమ్‌కుమార్‌రెడ్డి, మోహన్, మజీద్ పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకుంటాం



కోయిల్‌కొండ: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థిని ఆత్మహత్యకు యత్నించడానికి కారణమైన వారిపై చర్యలు తీసుకుంటామని డీఈఓ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన కేజీబీవీని సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థిని ఆత్మహత్యకు యత్నించడానికిగల కారణాలపై పూర్తి విచారణ జరిపి.. బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. డీఈఓ వెంట ఎంఈఓ వెంకట్‌జీ, పాఠశాల ప్రిన్సిపాల్ హారిక ఉన్నారు.

చిన్నారికి అభినందన



కోయిల్‌కొండ: మండలంలోని కొత్లాబాద్‌కు చెందిన నర్సింహులు కుమార్తె జస్విత భరతనాట్యంలో ఉత్తమ ప్రతిభకనబరిచి గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించింది. ఈ సందర్భంగా బుధవారం జస్వితను ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అభినందించారు. భవిష్యత్‌లో మరింత ఖ్యాతి పొందాలని ఆకాంక్షించారు.